సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం ၊ 16 ၊ సెప్టెంబర్ ၊ 2024



వడివడిగా సాగేనా..?

పేరూర్ ఎత్తిపోతల పథకం పనుల ప్రారంభంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



నిర్వహణ అస్తవ్యస్తం

జడ్చర్ల నుంచి కోదాడ వరకు ఉన్న ఎన్‌హెచ్ 167 ప్రమాదభరితంగా మారింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /24.1

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



గద్వాల అర్బన్: దేశంలో మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ, స్కూల్ బస్ డ్రైవర్స్, రైస్ మిల్లుల హమాలీలు, మిడ్‌డే మీల్స్ తదితర కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలలు వేతనాలను వెంటనే చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాలను ఆలిండియా టీయూసీఐలో విలీనం చేసినట్లు పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదించిన రోజు ఈనెల 23న బ్లాక్ డేను నిర్వహించాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికుల స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ ఈనెల 18న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్, వివిధ కార్మిక యూనియన్ల నాయకులు సలీం, రఫీక్, రాఘవేందర్, నాగసుందర్ తదితరులు ఉన్నారు.

తుమ్మిళ్ల లిఫ్ట్ నుంచి నీరు విడుదల చేయాలి

శాంతినగర్: తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్లను ఆన్ చేసి సాగునీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు కురవనందున వరిమడి గుంట్లలో నీరులేక పొలాలు నెర్రెలు వారుతున్నాయని వారు వాపోయారు. తుంగభద్ర నదిలో పుష్కలంగా నీరు ఉన్నా తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఎందుకు ఆన్ చేయడం లేదో అర్థంకావడంలేదని, ఇప్పటికైనా ఆర్డీఎస్ అధికారులు స్పందించి తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్‌చేసి పంటలు కాపాడాలని కోరారు. ఈవిషయమై ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నుంచి వస్తున్న నీరు డి–22లో మూడు అడుగుల మేర ప్రవహిస్తోందని, డి–26, 27 రైతులు ప్రస్తుతం నీరు అవసరం లేదని చెప్పడంతో తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడం లేదన్నారు. రైతులకు నీటి అవసరం ఉందని కోరితే సోమవారం తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్‌చేసి ఆర్డీఎస్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీరందిస్తామని ఆయన తెలిపారు.

జూరాలపై నీలినీడలు

మూడేళ్లుగా సా..గుతున్న క్రస్టు గేట్ల మరమ్మతు



రబ్బర్ సీల్ దెబ్బతినడంతో గేటు నుంచి లీకేజీ అవుతున్న నీరు

- గతేడాది గ్యాంట్రీ రిపేరుకే పరిమితం
- 12 గేట్లకు రబ్బర్ సీల్ ఏర్పాటుతో లీకేజీలు
- ఆరు గేట్లకు తెగిన రోప్‌తో ముప్పు
- అగ్రిమెంట్, పొడిగింపు గడువు ముగిసినా ముందుకు సాగని వైనం

జూరాల ప్రాజెక్టు రేడియల్ క్రస్టు గేట్లు : 64	బ్లాకులు 84
నీటి నిల్వ సామర్థ్యం : 9.657 టీఎంసీలు	ఆయకట్టు లక్ష్యం : 1.20 లక్షల ఎకరాలు
ప్రాజెక్టుకు వచ్చిన అత్యధిక వరద : 11 లక్షల పైచిలుకు	

గద్వాల: కృష్ణాబేసిన్‌లో రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టు.. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని.. అన్ని సాగునీటి ప్రాజెక్టులకు పెద్దన్నగా పేరుగాంచిన జూరాల ప్రాజెక్టుపై నీలినీడలు అలుముకున్నాయి. మూడేళ్లుగా సా..గుతున్న గేట్ల మరమ్మతు వ్యవహారమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రాజెక్టులోని మొత్తం గేట్లు మొదలుకొని రబ్బర్ సీల్స్, రోప్స్, పేయింటింగ్, సాండ్ బ్లాస్టింగ్, గేట్ల స్ట్రెంథనింగ్ తదితరవి మరమ్మతు చేసేందుకు మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం రూ.11 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం ఒప్పంద కాలపరిమితి.. పొడిగింపు గడువు ముగిసిపోయినా కేవలం 23 శాతం పనులు మాత్రమే పూర్తిచేశారు. ఇప్పటికే గేట్ల రబ్బర్ సీల్, రోప్‌లలో సమస్యల తలెత్తాయి. దీంతో నిత్యం వరద నీరు లీకేజీతోపాటు ప్రాజెక్టు ఉనికికే ముప్పు వాటిల్లే పరిస్థితులు దాపురించాయి.

సులభతరమైన విధానంలో..

జూరాల ప్రాజెక్టుకు మొత్తం 64 రేడియల్ క్రస్ట్ గేట్లు, 84 బ్లాకులు ఉన్నాయి. ఈ తరహా ప్రాజెక్టులో దేశంలోనే మొదటిది. జూరాలకు వరద వచ్చినప్పుడు ఈ 64 రేడియల్ క్రస్ట్ గేట్లను ఆపరేట్ (పైకెత్తడం) ద్వారా నీటిని దిగువకు విడుదల చేసేలా సులభతరమైన విధానంలో రేడియల్ క్రస్టు గేట్లు ఏర్పాటు చేశారు. గేట్లను పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు గేట్ల ఇరువైపుల రెండు రబ్బర్ సీల్స్, అడుగు భాగాన ఒక రబ్బర్ సీల్ ఉండగా.. ఆపరేట్ చేసేందుకు అవసరమైన ఇనుప రోప్ గేటుకు ఇరువైపులా రెండు, కింది భాగాన రెండు ఇనుప రోప్స్ ఉంటాయి. ఈ తరహా టెక్నాలజీని తొలిసారిగా జూరాల ప్రాజెక్టులో వినియోగించినట్లు అధికారులు తెలిపారు. వీటి సాయంతోనే మొత్తం రేడియల్ క్రస్టు గేట్లను అవసరమైనప్పుడు పైకి ఎత్తడం , దించడం వంటి ప్రక్రియ చేపడతారు.

⇨ రాతి కట్టడంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు పొడవు కిలోమీటర్, ఎత్తు 27.80 మీటర్లు. ప్రాజెక్టుకు మొత్తం 64 రేడియల్ క్రస్టు గేట్లు ఉన్నాయి. ఇందులో ఎడమ వైపున 4 నాన్ ఓవర్ ఫ్లో బ్లాకులు, కుడివైపున 10 నాన్ ఓవర్ ఫ్లో బాక్లులు, అలాగే 6 జల విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మించిన బ్లాకులు కలిపి మొత్తం 84 ఉన్నాయి. ఇన్ని బ్లాకులున్న ప్రాజెక్టు దేశంలో ఎక్కడా లేదు. అలాగే ప్రాజెక్టుకు ఆనుకుని ఎడమ వైపున 1.74 కి.మీ., కుడివైపున 1.84 కి.మీ., మేర ఎర్త్‌డ్యాం నిర్మించారు.

డిసెంబర్ నుంచి వేగవంతం..

జూరాల రిజర్వాయర్ క్రస్ట్ గేట్లకు మరమ్మతు చేసేందుకు మూడేళ్ల కిందట రూ.11 కోట్లు మంజూరయ్యాయి. అయితే 2022లో పనులు కొంతమేర వేగవంతంగా జరిగాయి. 2023లో గ్యాంట్రీ క్రేన్‌కు సమస్య తలెత్తడంతో పనులకు అడ్డంకిగా మారింది. ఈ ఏడాది డిసెంబర్ నుంచి పనులు వేగవంతం చేసి జూలై నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– జుబేర్, ఈఈ జూరాల డ్యాం

18 గేట్లకు రిపేర్లు

ప్రాజెక్టు మొత్తం 64 గేట్లలో 18 గేట్లు రబ్బర్ సీల్, ఇనుప రోప్‌లు దెబ్బతిన్నాయి. దీంతో ఏడాదికాలంగా ఈ గేట్ల ద్వారా నీరు లీకేజీ అవుతోంది. ప్రధానంగా గేట్లు దెబ్బతినకుండా, రాపిడికి గురికాకుండా రక్షణ కల్పిస్తూ ఉన్న రబ్బర్ సీల్ పూర్తిగా దెబ్బతిన్నాయి. అదే విధంగా గేట్లను పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు సహాయపడుతున్న ఇనుప రోప్‌లు దెబ్బతిని మరో 6 గేట్లు మరమ్మతుకు గురయ్యాయి. ఈ పరిస్థితుల్లో 2009 మాదిరిగా భారీ వరద వస్తే దెబ్బతిన్న గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం నెలకొంది. ఇటీవల కర్ణాటకలోని టీబీడ్యాం గేటు కొట్టుకుపోవడం, తాజాగా విజయవాడలోని కృష్ణా బ్యారేజీ గేట్లు దెబ్బతినడం ఘటనలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడి మొత్తం గేట్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి భారీ వరదలు వచ్చినా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



గ్యాంట్రీ క్రేన్ సాయంతో గేట్లకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

2009లో భారీ వరదలు..

ప్రాజెక్టులోని గేట్లకు సంబంధించి చిన్నపాటి మరమ్మతు చేస్తూ వస్తున్న అధికారులు ప్రాజెక్టు మొత్తం గేట్లను ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో ఒక్కసారి కూడా చేయలేదు. ప్రాజెక్టు చరిత్రలో అత్యధికంగా 2009లో భారీగా వరద రాగా అప్పుడు సుమారు 11 లక్షల పైచిలుకు క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టులోని మొత్తం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలోనే గేట్లను కాపాడుతున్న రబ్బర్ సీల్, ఇనుప రోప్స్ కొంతమేర దెబ్బతిన్నాయి. అయితే వీటికి పూర్తిస్థాయిలో అవసరమైన మరమ్మతు చేయకుండా తాత్కాలిక పనులతో సరిపెడుతున్నారు.

నిధులు మంజూరు..

జూరాల ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా అన్ని గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల కిందట రూ.11 కోట్లు మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా గేట్ల స్ట్రెంథనింగ్, సాండ్ బ్లాస్టింగ్, రోప్ రిపేర్లు, రబ్బర్ సీల్ రిపేర్లు, బకెట్ నిర్మాణాల మరమ్మతు చేయాల్సి ఉంది. ఈ పనులు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ టెండర్ దక్కించుకుంది. ఏడాది కాలపరిమితి గడువు విధిస్తూ పనులు పూర్తిచేసేందుకు సదరు కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకున్నారు.

నత్తకు నడక నేర్పేలా..

కాంట్రాక్టు దక్కించుకున్న సదరు కంపెనీ మూడేళ్లుగా పనులు పూర్తిచేయడంలో పూర్తిగా అలసత్వం ప్రదర్శిస్తూ నత్తకు నడక నేర్పుతోంది. డ్యాం పైభాగాన ఉన్న హాయిస్ట్ బ్రిడ్జి, గేట్ల వద్ద ఉన్న వాక్ వే బ్రిడ్జికి సంబంధించి సాండ్ బ్లాస్టింగ్ పనులు పూర్తిచేయగా.. మిగిలినవి కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం పనుల్లో కేవలం ఇప్పటి వరకు 23 శాతం మాత్రమే పూర్తి చేశారంటే పనుల పురోగతి ఏ మేరకు సాగుతుందో స్పష్టమవుతుంది.

ఎమ్మెల్యే జీఎమ్మార్‌కు సీఎం పరామర్శ



కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, రాజేశ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

- దమగ్నాపూర్‌లో ఆయన తండ్రి కృష్ణారెడ్డి దశదినకర్మకు హాజరు
- పాల్గొన్న మంత్రి జూపల్లి, ఉమ్మడి జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని ఓదార్చుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

దేవరకద్ర/ చిన్నచింతకుంట: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. దమగ్నాపూర్‌లో నిర్వహించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఘనంగా నివాళులర్పించారు. హెలీకాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి దమగ్నాపూర్‌కు చేరుకోగా..రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, మహబూబ్‌నగర్, వనపర్తి కలెక్టర్లు విజయేందిర, ఆదర్శ్ సురభి స్వాగతం పలికారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హాజరయ్యారు. దాదాపు అరగంటకు పైగా సీఎం రేవంత్‌రెడ్డి అక్కడే ఉన్నారు.సీఎం పర్యటన నేపథ్యంలో ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, ఏఎస్పీ రాములు బందోబస్తును పర్యవేక్షించారు.

సీఎం రాక.. పోక

సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో 12.58 గంటలకు దమగ్నాపూర్ చేరుకున్నారు. హెలీప్యాడ్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పోలీసు బందోబస్తు మధ్య 1.05 గంటలకు ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. అక్కడ దశదినకర్మలో పాల్గొని తిరిగి 1.37 గంటలకు బయలుదేరారు. 1.45 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకొని హెలీకాప్టర్‌లో తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న

అయిజ: అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి నూతన పాలకవర్గ సభ్యులంతా కలిసికట్టుగా కృషి చేద్దామని మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న అన్నారు. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన దొడ్డెన్న, వైస్ చైర్మన్ కుమార్, డైరెక్టర్లు సులోచనమ్మ, రంగస్వామిని ఆదివారం రైతు సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్.శ్రీధర్ అధ్యక్షతన సన్మానం చేశారు. ఈసందర్భంగా చైర్మన్ దొడ్డెన్న మాట్లాడుతూ.. అయిజలోని మార్కెట్ సబ్ యార్డ్‌ను మార్కెట్ యార్డుగా అప్‌గ్రేడ్ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారని, ఇది రైతులకు శుభపరిణామమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తుందని, సాంకేతిక లోపాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే రుణమాఫీ కాబోతుందని అన్నారు. వైస్ చైర్మన్ కుమార్ మాట్లాడుతూ.. అయిజ సబ్ యార్డ్ త్వరలో మార్కెట్ యార్డుగా రూపాంతరం చెందబోతుందని.. దీనికోసం రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలుస్తామని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్.శ్రీదర్, మధు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమే ఘనం..!

నేటికీ అందుబాటులోకి రాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- 2.30 ఎకరాల్లో రూ.17 కోట్లతో నిర్మాణం
- ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రారంభం
- ఏడాది గడిచినా అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- రోడ్లపైనే చిరు వ్యాపారాలు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు



గద్వాలలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం

గద్వాలన్యూటౌన్: జిల్లా కేంద్రమైన గద్వాలలో ఇంటిగ్రేటెడ్ (సమీకృత) మార్కెట్ ఇక్కడి ప్రజలకు అందని ద్రాక్షలా మారింది. ఈ మార్కెట్‌ను ఘనంగా ప్రారంభించినప్పటికీ, దానిని అందుబాటులోకి తీసుకురావడం మాత్రం అధికారులు మరిచారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు ఖాళీ స్థలంలో 2.30 ఎకరాల్లో అధునాతనంగా దాదాపు రూ.17 కోట్లతో నిర్మించిన ఈ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకరావడంలో అధికారులు విఫలమవుతున్నారు.

అన్ని ఒకేచోట..

గద్వాల పట్టణం జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి, విద్య నిమిత్తం చాలా మంది పట్టణానికి వచ్చి స్థిరపడుతున్నారు. పట్టణం నలువైపులా విస్తరిస్తోంది. ఈక్రమంలో ప్రజలకు సరిపడా సౌకర్యాల కల్పనపై పాలకులు, అధికారులు దృష్టి సారించారు. పట్టణంలోని మటన్, ఫిష్ మార్కెట్‌లు చిన్నవిగా ఉన్నాయి. కూరగాయల మార్కెట్ పెద్దదిగా ఉన్నా అది కూడా ఒక్కటే ఉన్నది. అన్నీ ఒకే చోట ఉంటే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో మార్కెట్‌యార్డు ఆవరణలో 2.30 ఎకరాల స్థలంలో స్టేట్ డెవలెప్‌మెంట్ ఫండ్ నుంచి దాదాపు రూ.17 కోట్లతో నిర్మాణం పూర్తి చేశారు. 2021 సెప్టెంబర్ 14న శంకుస్థాపన అయిన మార్కెట్‌ను గడిచిన అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రారంభించి.. వదిలేశారు.

అధునాతనంగా..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అధునాతనంగా నిర్మించారు. విశాలమైన పార్కింగ్ స్థలంతో పాటు బ్లాక్ వైస్‌గా వెజ్, నాన్‌వెజ్, సూపర్‌మార్కెట్, కమర్షియల్ దుకాణాలను వేరువేరుగా నిర్మాణం చేశారు. అడ్మిన్ కార్యాలయం సైతం ఏర్పాటు చేశారు. వెజ్ బ్లాక్‌లోని దుకాణాల్లో కూరగాయల గంపలు పెట్టడానికి స్టెప్ వైజ్‌గా కట్టారు. ఇక నాన్‌వెజ్‌కు సంబంధించి మటన్, ఫిష్, చికెన్ దుకాణాల్లో ప్రతి దుకాణంలో నాన్‌వెజ్‌ను శుభ్రం చేసేందుకు నీటి సౌకర్యంతో సింక్‌ను, తగిలించేందుకు ప్రత్యేకంగా స్టీల్ రాడ్‌లను ఏర్పాటు చేశారు.

అందుబాటులోకి వచ్చేదెన్నడో..

నిర్మాణం పూర్తి అయి, ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దాదాపు ఏడాది గడుస్తున్నా ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం అప్పటి అడిషనల్ కలెక్టర్ అధికారులతో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. అందుబాటులోకి తీసుకరావడానికి అవసరమైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా అప్పుడు హడావిడిగా మున్సిపల్ అధికారులు కూరగాయల, ఫ్రూట్, మటన్, చికెన్, ఫిష్ వ్యాపారుల అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌లో ఉన్న సౌకర్యాలను చూపించారు. వ్యాపారులు, వీధి వ్యాపారులు ఇక్కడ వ్యాపారం చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈతర్వాత దీని గురించి మరిచారు. అందుబాటులోకి తీసుకరావడానికి ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందుబాటులోకి వస్తే ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. పట్టణం బాగా విస్తరిస్తోంది. ప్రజలకు అన్నీ ఒకే చోట లభించే మార్కెట్ లేదు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న మార్కెట్ వల్ల అన్ని ఒకే చోట లభిస్తాయి. కూరగాయలు, నిత్యవసర సరుకులు, మటన్, ఫిష్, చికెన్ ఇలా అన్ని ఒకే చోట వినియోగదారులు కొనుగోలు చేయవచ్చు. ఇవన్నీ మార్కెట్ అందుబాటులోకి వస్తేనే సాధ్యపడుతాయి. ఇప్పటికైనా అధికారులు అటువైపు అడుగులు వేసి రూ.కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



వెజ్ బ్లాక్‌లో కూరగాయల దుకాణాలు

గద్వాల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వివరాలు

మార్కెట్ నిర్మించిన స్థలం 2.30 ఎకరాలు	కమర్షియల్ దుకాణాలు : 34
వెజిటేరియన్ బ్లాక్‌లో దుకాణాలు: 107	మటన్, చికెన్ బ్లాక్‌లో దుకాణాలు: 46
ఫిష్ బ్లాక్‌లో దుకాణాలు: 39	

చర్యలు తీసుకుంటాం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ విధివిదానాలను పరిశీలిస్తాం. కొద్దిరోజుల్లో మార్కెటింగ్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తాం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– నర్సింగరావ్, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్

విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోండి

- 30 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు
- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ పోస్టర్లు విడుదల చేస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, చిరు ఉద్యోగులు, రెగ్యులర్‌గా చదువుకునే వీలు లేనివారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డి డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీకి సంబంధించిన పోస్టర్ల విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలు కారణాలతో రెగ్యులర్ విద్యను మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు కూడా ఓపెన్ యూనివర్సిటీలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ వృత్తుల్లో పనిచేస్తూ సైతం ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సులను పూర్తి చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు చదువుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు అవకాశం ఉందని, ఈ కోర్సులు పోటీ పరీక్షలకు సైతం ఉపయోపడతాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్లు కిషోర్ రెడ్డి, వెంకన్న, ప్రేమయ్య, మల్లయ్య, కళాశాల స్టాఫ్ శంకర్, జ్యోతి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లకు మూడోస్థానం



తృతీయ బహుమతి గెలుచుకున్న జిల్లా బాలికల జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు/ నాగర్‌కర్నూల్ రూరల్: హైదరాబాద్‌లోని మౌలాలిలో ఆదివారం ముగిసిన 34వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా ఖోఖో పోటీల్లో ఉమ్మడి బాల, బాలికల జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచాయి. ఈ పోటీల్లో బాల, బాలికల జట్లు మూడో స్థానంలో నిలిచాయి. జట్లను ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఒబేదుల్లా కొత్వాల్, జీఏ.విలియం అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న టోర్నీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కోచ్‌లు వెంకటేష్, హరీష్, గీత, కృష్ణ, టెక్నికల్ అఫీషియల్ చక్రవర్తి సహాయకులుగా వ్యవహరించారని పీఈటీ మహేష్, సామ రమేష్ తెలిపారు.

క్లుప్తంగా

మరణంలోనూ వీడని బంధం

- భార్య మరణాన్ని తట్టుకోలేక గంట వ్యవధిలోనే భర్త మృతి
- మహబూబ్‌నగర్ జిల్లా చిల్వేర్‌లో ఘటన


అనసూయ - మాసయ్యగౌడ్ (ఫైల్)

మిడ్జిల్: వారి దాంపత్య జీవితం అర్ధ శతాబ్దంపాటు అన్యోన్యంగా సాగింది. ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమ వారి మరణంలోనూ తోడయ్యింది. భార్య మరణాన్ని తట్టుకోలేక గంట వ్యవధిలోనే భర్త మృతిచెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని చిల్వేర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిల్వేర్ గ్రామానికి చెందిన బొల్లం అనసూయ(72) వారం రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. అయితే మూడు నెలల క్రితం కాలు విరిగి మంచానికే పరిమితమైన ఆమె భర్త మాసయ్యగౌడ్(76)కు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన మాసయ్యగౌడ్.. గంట వ్యవధిలోనే మృతిచెందాడు. ఒకే రోజు భార్యాభర్తల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారికి ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమను గుర్తుచేసుకొని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


శ్రీను(ఫైల్)

చారకొండ: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో బైక్‌పై వెళ్తున్న వాహనదారుడిని ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగూరు మండల కేంద్రానికి చెందిన నారమోని శ్రీను(40) కొంత కాలంగా చింతపల్లి మండలం కుర్మేడులో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. అతనికి సొంత లారీ ఉండటంతో తానే డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న లారీ లోడ్‌తో కర్ణాటక వెళ్లారు. తిరిగి వచ్చిన డ్రైవర్ శ్రీను ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై కుర్మేడుకు వెళ్తుండగా.. చారకొండ మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న చారకొండ పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతుని వివరాలను సేకరించి కుటుంబ సభ్యులకు తెలిపి, పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలియజేశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: మండలంలోని అప్పాయిపల్లి శివారులోని మశమ్మ చెరువులో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు వనపర్తి రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులోని మశమ్మ చెరువులో ముళ్లపొదలో నీటిపై తేలియాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని పంచాయతీ కార్యదర్శి ఉమ్మాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. దాదాపు 10 నుంచి 20 రోజుల కిందట ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. మృతదేహం ముళ్లపొదలో ఉండటంతో ఎవరూ గమనించలేదన్నారు. మృతదేహాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తిస్తే వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

నెమలి మృతి



గద్వాల క్రైం: గద్వాల పట్టణంలోని 24వ వార్డులో జాతీయ పక్షి నెమలి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కాలనీవాసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుపేట కాలనీలో నెమలి సంచరించినట్లు కాలనీవాసులు గుర్తించారు. అయితే వీధి కుక్కలు నెమలిని వెంటాడిన క్రమంలో ప్రమాదవశాత్తు గాయాలకు గురై ముళ్లపొదలో అపస్మారక స్థితిలో పడింది. గమనించిన కాలనీవాసులు కాపాడే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న వార్డుకౌన్సిలర్ శ్రీనివాసులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులు గుర్తించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. నెమలి కాలనీలోకి ఎలా వచ్చిందనే విషయంపై స్పష్టత లేదు. కుక్కల దాడిలో మృతిచెందిందా లేక ఎవరైనా.. పట్టుకొచ్చారనే అంశంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

వడివడిగా సాగేనా..?


పేరూర్ ఎత్తిపోతల పథకం పనులు ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం హయాంలో రూ. 51 కోట్లతో అన్ని విధాల అనుమతులు వచ్చినప్పటికీ, శంకుస్థాపన అనంతరం పలు కారణాలతో పనులు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులతో, కాంట్రాక్టర్లతో మాట్లాడి ఇటీవల పనులను ప్రారంభించారు. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కొనసాగుతున్న పేరూర్ లిఫ్టు కాల్వ పనులు (ఫైల్)

- రెండేళ్ల అనంతరం మొదలైన పేరూర్ ఎత్తిపోతల పనులు
- సంతోషంలో ఆయకట్టు రైతులు

దేవరకద్ర రూరల్: ఎత్తయిన ప్రదేశంలో జీవనం, ఆ రైతులకు శాపంగా మారింది. సమీపంలోనే కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ ఉన్నప్పటికీ సాగు నీరు అందక ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడిన కౌకుంట్ల మండలంతో పాటు గతంలో ఉన్న చిన్నచింతకుంట, మదనాపురం మండలాల పరిధిలోని గ్రామాల రైతుల పరిస్థితి ఇది. అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటలు సాగు చేసినప్పటికీ, పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం లేక భూములు బీడు వారే పరిస్థితి. ఈ క్రమంలోనే 2022లో పేరూర్ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని అప్పటి ప్రభుత్వం భావించింది. రూ. 51 కోట్లతో అన్ని విధాల పరిపాలన అనుమతులతో, 3వేల నుండి 2500 ఎకరాలకు సాగునీరు అందించేలా మొదలైన పనులు శంకుస్థాపనతోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.


పేరూర్ ఎత్తిపోతల మ్యాప్

రైతులకు మేలు

పేరూర్ ఎత్తిపోతల పను లు పూర్తి అయితే అంత సస్యశామలంగా మారుతుంది. 3 మండలాల రైతులకు మేలు జరుగుతుంది. ఈ పథకం కోసం గత ప్రభుత్వంలో అనుమతులు వచ్చినప్పటికీ, కమిషన్‌ల కోసం పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. గడువులో గా పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

సాగునీటికి అవస్థలు పడ్డాం



మా అన్నదమ్ములకు ఎనిమిదెకరాల పొలం ఉంది. పంటల సాగుకు కావాల్సిన నీరు అందక పోవడంతో, సరైనా దిగుబడి రాక అనేక సార్లు పెట్టుబడి డబ్బులు అందని పరిస్థితులు తలెత్తాయి. ఎన్నో అవస్థలు పడ్డాం. ఈ లిఫ్ట పనులు పూర్తి అయితే మాకు సాగునీటి కష్టాలు తొలుగుతాయని నమ్మకం ఉంది.

– బండారి సత్యనారాయణ, రైతు, పేరూర్

ఇబ్బందులు తొలగుతాయి



ఎన్నో ఏళ్లుగా సాగు నీటి కోసం అవస్థలు పడుతున్నాం. పక్కనే కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ ఉన్నప్పటికీ మా పొలాలు ఎత్తయిన ప్రదేశంలో ఉండటం వల్ల పంటలకు సరిపడా సాగునీరు అందలేదు. ఈ లిఫ్ట పనులు పూర్తి అయితే మాలాంటి చిన్న రైతుల దశాబ్దాల కల నేరువేరుతుంది. సాగునీటి ఇబ్బందులు తొలుగుతాయి. – శ్రీనివాస్‌యాదవ్, రైతు, పేరూర్

నీరు వృథా కాకుండా ప్రణాళికలు

పేరూర్ ఎత్తిపోతల పనులు మొత్తం అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా జరగనున్నాయి. రామన్‌పాడ్ నుంచి ముందుగా కొత్తపల్లిలోని పంపు హౌస్‌కు, అక్కడి నుంచి పేరూర్- వెంకంపల్లి సమీపంలోని తుపాకుల గుట్టపై నిర్మించే ప్రధాన ట్యాంకుకు నీటిని చేరవేస్తారు. అనంతరం 60 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన 44 ట్యాంకులను అవసరమైన చోట ఏర్పాటు చేసి నీటిని నింపుతారు. వీటి నుంచి ఓపెన్ పైప్‌లైన్ ద్వారా నీటిని పొలాలకు సరాఫరా చేస్తారు. ఈ పనులు అన్ని అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా జరుగుతుండటంతో నీరు వృథా కాకుండా, లక్ష్యం ప్రకారం సాగు నీరు అందుతుంది. అలాగే లిఫ్ట పనులు పంట విరామ సమయంలో ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా శరవేగంగా జరుగుతాయని అధికారులు చెప్తున్నారు. పేరూర్ ఎత్తిపోతల పనులు 2022 సంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉంది. శంకుస్థాపనలకే ఆగిపోయిన పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే వానాకాలం సీజన్ నాటికి రైతులకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ లిఫ్ట పనులు పూర్తి అయితే దేవరకద్ర నియోజకవర్గంలో మూడు మండలాల రైతులకు సాగు నీరు అందుతుంది. కౌకుంట్ల, చిన్నచింతకుంట, మదనాపురం మండలంలో దాదాపు 3 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు సాగునీరు ఇవ్వనున్నారు.

గుట్టుగా కోడిపందేలు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి) : మండలంలోని మంగనూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గుట్టుగా కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. 17 బైకులు, 8 ఫోన్లు, నాలుగు పందెం కోళ్లు, 13వేల నగదును స్వాధీనం చేసుకుని 10 మందిపై కేసులు నమోదు చేశారు. తిమ్మాజీపేట మండలం చేగుంట గ్రామానికి చెందిన గంటల నరేష్ ఈ పందేలను నిర్వహిస్తున్నాడని, ఆదివారం నిర్వహించిన దాడుల అనంతరం పోలీసుల విచారణలో తెలిసింది. నరేష్ తప్పించుకోగా 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొందరు సైతం తప్పించుకున్నారు. తప్పించుకున్న వారిలో 20 మంది వరకు ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. దాడుల్లో సీఐ కనకయ్యగౌడు, ఎస్ఐ నాగశేఖరరెడ్డి, తిమ్మాజీపేట ఎస్ఐ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీజిల్‌లో నీళ్లు!


వేరు వేరు డబ్బాల్లోని డీజిల్‌ను చూపుతున్న నరేష్ నాయక్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న ఓ బంకులో డీజిల్ తీసుకెళ్లగా నీరు వచ్చిందని.. మోసానికి గురిచేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వెంకటాపూర్ తండాకు చెందిన నరేష్ నాయక్ శనివారం సదరు బంకులో రూ. 2500ల డీజిల్‌ను కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. తీరా ట్రాక్టర్‌లో పోసి స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా ఎంతకూ అది స్టార్ట్ కాలేదు. దీంతో బంకు వద్దకు వచ్చి యజమానులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ డీజిల్‌ను తీసుకుని మళ్లీ అతడికి వేరేగా డీజిల్ అందించారు. అయితే సమస్య రావడంపై నరేష్ నాయక్ ప్రశ్నించారు. తాను మొదట తీసుకున్న డీజిల్ ఈ రోజు పోసిన డీజిల్‌ను విలేకరులకు చూపించారు. ఎందుకు ఇలాంటి సమస్యలు వస్తున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు. రెండు రోజుల క్రితం మహబూబ్‌నగర్ రూట్‌లో ఉన్న ఓ బంకులోనూ కల్తీ జరిగిందని ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించి అలాంటిదేమీ లేదని తేల్చడంతో పాటు బంకుల యజమానులు నాణ్యమైన డీజిల్ అందించాలని చెప్పి వెళ్లిపోయారు. రెండు రోజులకే మరోసారి కల్వకుర్తిలోని మరో బంకులో ఇలా డీజిల్‌లో నీళ్ల రావడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు అన్ని బంకుల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విషయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తనిఖీలు చేసి అక్రమాలను అడ్డుకుంటామని అన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన స్థానిక క్లబ్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందంగౌడ్ కథనం మేరకు..నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన మహ్మద్ అసన్ అలీఖాన్ తాలుకా క్లబ్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. శనివారం ఇంటికి తాళం వేసి సొంత గ్రామానికి వెళ్లారు. ఆదివారం ఇల్లు తెరుచుకుని ఉండడంతో గమనించిన యజమాని వారికి సమాచారం ఇచ్చారు. దీంతో బాధితులు వచ్చి చూశారు. బీరువాలలో దాచి ఉంచిన 2.75 తులాల బంగారు నగలు పోయినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వానాకాలం పంటలలో చీడపీడల నివారణ


మహబూబ్‌నగర్ రూరల్ మండలం పోతన్‌పల్లిలో పత్తి పంట

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల వివిధ పంటలలో కొన్ని రకాల చీడపీడల ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలలో ప్రస్తుతం ఉన్న పంట దశలో కొన్ని రకాల చీడపీడలు వర్షాలతో ఆశించే అవకాశం ఉంది.

వరి: వరి పంట దుబ్బు చేసే/ కట్టే దశ నుంచి అంకురం చిరుపొట్ట దశలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ముందుస్తుగా నాట్లు వేసిన వరి పంట పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటలో బ్యాక్టీరియ ఎండకు తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు, స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్ 60 గ్రాములను కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలి. అలాగే తెగులు లక్షణాలు తొలిదశలో గుర్తిస్తే నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా ఆపాలి. ఆఖరి దఫాగా పొటాష్ ఎరువును వేయాలి. అలాగే కాపర్ శిలీంద్రనాశినులను పూత దశలో ఉన్న వరి పంటలో పిచికారీ చేయరాదు.

■ ప్రస్తుతం వరి పంటలో జిల్లావ్యాప్తంగా అధిక గాలులు వీయడం, వర్షాలు పడడం వల్ల పంట పసుపు రంగు మారడం, కొనల నుంచి తెల్లటి చారలు ఏర్పడటం క్షేత్రస్థాయిలో గమనించడమైనది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వర్షాలు తగ్గిన తర్వాత పై పాటుగా ఎరువులను వేసినట్లయితే పంట ఆరోగ్యంగా పెరుగుతుంది.

నీరు నిల్వ ఉండకుండా..

పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా కాల్వలు చేసి బయటకు తీయాలి. నీరు నిల్వ ఉంటే మొక్కలు చనిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా పత్తి పంటలో అధిక వర్షాల వల్ల ఎండు తెగులు ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. తెగులు వ్యాప్తిని నివారించడానికి కార్బండిజం ఒక గ్రాము ఒక లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద పంపు నాజిల్ తీసి తెగులు ఆశించిన మొక్కలతోపాటు ఆరోగ్యంగా ఉన్న మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. పత్తిలో ఆకు మచ్చ తెగుళ్లతోపాటు కాయకుళ్లు తెగుళ్ల ఉధృతంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా అధిక వర్షాలు, చిరుజల్లులు, గాలిలో తేమశాతం ఉన్నప్పుడు పత్తిలో తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటాయి. ప్రధానంగా కాయకుళ్లు తెగులు ఆశించినట్లయితే దిగుబడులపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. అలాగే ఆకుమచ్చ తెగుళ్లతోపాటు ఆల్టేనేరియా ఆకుమాడు, కాండం మాడు తెగులు కూడా సమస్యాత్మకం అయ్యే అవకాశం ఉంది. వీటి నివారణకు కార్బండిజం, మాంకోజెబ్ 500 గ్రా. లేదా ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్, టెబుకోనజోల్ 80 గ్రా. ఒక ఎకరాకు పిచికారీ చేయాలి.

అధికారి సలహా


బి.వెంకటేష్, డీఏఓ, మహబూబ్‌నగర్

మొక్కజొన్న

అధిక నీరు అసలు తట్టుకోలేదు. కాబట్టి లోతైన కాల్వల ద్వారా నీటిని బయటికి తీసివేయాలి. వర్షాల నుంచి పంట త్వరగా కోలుకోవడానికి ఎకరాకు 20 కిలోల మ్యూరట్ పొటాష్ వేసుకోవాలి.

జూరాల గేట్ల మూసివేత

ప్రాజెక్టుకు 40,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గు ముఖం పట్టడంతో గేట్లను మూసివేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి 40వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు వివరించారు. కాగా మూడు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 27,319 క్యూసెక్కుల నీరు ఉపయోగిస్తున్నారు. మొత్తంగా 29, 542 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 5 గేట్ల ద్వారా 20,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 32.078 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.


జూరాల ప్రాజెక్టు

సుంకేసులకు తగ్గిన వరద

రాజోళి: సుంకేసులకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఎగువ నుంచి 15,882 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, మూడు గేట్లను తెరిచిన అధికారులు 13,437 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 883.4 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం నీటిమట్టం 883.4 అడుగుల వద్ద 206.0996 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 27,850 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 13,437 మొత్తం 41,287 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తున్నాయి. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,116 మొత్తం 68,194 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 29,167 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.939 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.288 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న గద్దమీది గోపాల్

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన మహబూబ్‌నగర్‌కు వస్తున్న మాదిగల మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయాలని.. మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దమీది గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. ఈనెల 19న హైదరాబాద్ నుంచి యాత్ర ప్రారంభమై ఈనెల 20న మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఇక్కడి నుంచి గద్వాలకు చేరుకుంటుందని, 21న ఉదయం 10 గంటలకు వనపర్తి, మధ్యాహ్నం 2 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లాకు చేరుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని మాదిగలు, యువకులు, మహిళలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో వర్గీకరణ ప్రకటించినందుకు హర్షిస్తున్నామని అన్నారు. తెలంగాణలో నిరుద్యోగులైన మాదిగ యువతకు ఉద్యోగ నియామకాలలో అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. సమావేశంలో నాయకులు గొరిట దినేష్, అరుణ్‌కుమార్, భూపతి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో గణనాథుల నిమజ్జనం


ట్రాక్టర్‌లో బీచుపల్లికి తరలుతున్న గణనాథుడు


క్రేన్‌లో తరలుతున్న గణనాథుడు

ఎరవల్లి: గణేష్ ఉత్సవాలలో భాగంగా తొమ్మిదవరోజు అధిక సంఖ్యలో గణనాథులను శోభాయాత్రగా తరలించి ఆదివారం బీచుపల్లి కృష్ణానదిలో భక్తులు నిమజ్జనం చేశారు. తొమ్మిదవ రోజు కావడంతో నిమజ్జనం కోసం గ్రామాలలో ప్రత్యేక ఏర్పాట్లను చేసుకొని అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గ్రామాలలో మండపాల ముందు లడ్డూ వేలం నిర్వహించారు. మండపాల దగ్గర నుంచి పిల్లలు, పెద్దలు భజనలు, నృత్యాలు చేసుకుంటూ బీచుపల్లి కృష్ణానదికి చేరుకొన్నారు. అనంతరం గజ ఈతగాళ్ల, వివిధ శాఖల అధికారుల సమక్షంలో క్రేను సహాయంతో గణనాథులను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం దృష్ట్యా బీచుపల్లి పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెవెన్యూ, మత్స్యశాఖ, విద్యుత్, వైద్యశాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉన్నారు. అదేవిధంగా బీచుపల్లి పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్‌జాం కాకుండా ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.


శోభాయాత్రలో కోలాటం వేస్తున్న చిన్నారులు

'ధర్మం గెలిచిన సభ' కరపత్రాలు ఆవిష్కరణ


ధర్మం గెలిచిన సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్(ఆర్ఆర్) నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు సమన్యాయానికి దళిత, గిరిజనులకు సరైనదారి అని ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) నాయకులు కె.తిరుమలయ్య, మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాత తోటలో ఎమ్మార్పీఎస్(ఆర్ఆర్) ఆధ్వర్యంలో 'ధర్మం గెలిచిన సభ' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి వెనుకబడిన కులానికి, తెగకు రిజర్వేషన్ల పంపిణీ జరగడానికి వీలుగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప వర్గీకరించి తీరాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో ఏడుగురు న్యాయమూర్తులు 6.1 రాజ్యాంగ ధర్మాసనం తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. 1994 నుంచి ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తూనే ఉందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మాదిగలు, మాదిగ సంఘాలు ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలు, బలిదానాలు చేశారని అన్నారు. ఈ నెల 24న స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో 'ధర్మం గెలిచిన సభ' ఏర్పాటు చేశామని, ఈ సభకు ప్రజాప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల అనిల్‌కుమార్, వెంకట్, పవన్, శ్రీనివాసులు, భీమయ్య, భరత్, కోస్గి నర్సిములు, అబ్దుల్ జాకీర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ మిలాద్-ఉన్- నబీ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: మిలాద్–ఉన్–నబీ పర్వదినం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలైన కరుణ, సహనం, సమైక్యత, సామరస్యం, విశ్వ మానవ సోదర భావం.. నిత్యం మనందరిలో స్ఫూర్తిని నింపుతూ ఉంటాయని, అందరి మేలు కోసం పని చేసేలా ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

ప్రవక్తబోధనలతో ధర్మబద్ధ జీవనం : సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: 'మిలాద్–ఉన్–నబీ' పర్వదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజని పేర్కొన్నారు. శాంతి, సోదర భావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని చాటి చెప్పే ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి దిక్సూచి లాంటివని సీఎం తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా మిలాద్–ఉన్–నబీ శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్ ఎడమకాల్వ వారంలోగా పునరుద్ధరణ

▶ మొదటి పేజీ తరువాయి

ముక్త్యాల బ్రాంచి కాల్వకు పడిన భారీ గండ్లు, వాటి మరమ్మతులకు జరుగుతున్న పనులను పరిశీలించారు. మరమ్మతులను పూర్తి చేసి వారంలోగా ఎడమ కాల్వకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ ఇంజనీర్లకు సూచించారు. రెడ్లకుంట మేజర్ కాల్వకు 5 రోజుల్లో, ముక్త్యాల బ్రాంచి కాల్వకు 3 రోజుల్లోగా మరమ్మతులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కాగితం రామచంద్రాపురం దిగువన కుడికాల్వ కింద 2లక్షల ఎకరాలు, రెడ్లకుంట మేజర్ కాల్వ కింద 20వేల ఎకరాలు, ముక్త్యాల బ్రాంచి కాల్వ కింద 1.01 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు అవుతోందని, నీళ్ల కోసం రైతుల నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రింబవళ్లు పనులు నిర్వహించాలని ఆదేశించారు.

పునరుద్ధరణలో ఇంత వేగం ఎన్నడూ చూడలేదు..

ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు రాష్ట్రంలో ఎన్నడూ లేని రీతిలో భారీ వర్షాలు కురిసి వరదలు పోటెత్తగా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పునరుద్ధరణ పనులకు అంచనాలు తయారు చేశామని, అత్యవసరంగా షార్ట్ టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరుగుతున్న వరద సహాయక చర్యల వేగాన్ని తన రాజకీయ జీవితంలో మరెన్నడూ చూడలేదన్నారు. సాగర్ కుడికాల్వకు పడిన గండిని పూడ్చడానికి సాధారణంగా నెల రోజుల సమయం పడుతుందని, వచ్చే ఆదివారంలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

నష్టపోయాం.. మమ్మల్ని ఆదుకోండి..

కాగితం రామచంద్రాపురం, ఆర్ల గూడెం, కరక్కాయలగూడెం పర్య టన సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు మంత్రి ఉత్తమ్‌ను కలిసి తమను ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు. వరదల్లో పంటలు దెబ్బ తినడమే కాకుండా పొలాల్లో నాలు గైదు అడుగుల మేర ఇసుక మేటలు వేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.16,500 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. ఇళ్లు నష్టపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం చెల్లిస్తామని చెప్పారు.



చిలుకూరు మండలంలో ఆర్లెగూడెం వద్ద పడిన గండి వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఫార్మాసిటీ ఉంటుందా? లేదా?

ప్రాజెక్టు వద్దనుకుంటే రైతుల భూములు తిరిగి ఇచ్చేయాలి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ ప్రాజెక్టును ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైకోర్టు సైతం ఈ విషయంలో స్పష్టత కోరిందని, తక్షణమే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌ను అంతర్జాతీయంగా నంబర్ వన్‌గా నిలిపే ఉద్దేశంతో ఫార్మా సిటీ అనే బృహత్తరమైన ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించే లక్ష్యంతో ఫార్మా సిటీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందనే ఆలోచన చేశామన్నారు. భూ సేకరణను సైతం పూర్తి చేశామని తెలిపారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గందరగోళం నెలకొందన్నారు. ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లుగా సీఎం ప్రకటించటంతో ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఫార్మా సిటీ వస్తే ఉద్యోగాలొస్తాయని భావించిన యువత, బతుకులు బాగుపడతాయని భూములు ఇచ్చిన రైతుల్లో గందరగోళం నెలకొందన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఇతర ప్రాజెక్టుల కోసం వినియోగిస్తామంటే కుదరదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మొండి పట్టుదలకు పోయి రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీయవద్దని కోరారు. ప్రాజెక్టును రద్దు చేయాలని భావిస్తే రైతుల భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. భూములను ఇతర అవసరాలకు వాడతామంటే రైతులతో పాటు బీఆర్‌ఎస్ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు: 'అసలు పార్టీలో చేర్చుకోవడం ఎందుకు? ఆ తర్వాత పదవులు పోతాయన్న భయంతో ఈ నాటకాలెందుకు?'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు, మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'సిగ్గులేకుండా ఇంత నీతిమాలిన రాజకీయం ఎందుకు? మీరు ప్రలోభపెట్టి చేర్చుకున్న వాళ్లను మా వాళ్లు అని చెప్పుకోలేని మీ బాధను చూస్తే జాలి కలుగుతోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు'అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

జగన్ పాలనలో తలసరి ఆదాయం భారీగా పెరుగుదల

గత ఐదేళ్లలో రూ.88,448 పెరిగిన రాష్ట్ర తలసరి ఆదాయం

గతంలో చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పెరుగుదల రూ.60,128 మాత్రమే

2023-24లో రూ.2.42 లక్షలకు చేరిన రాష్ట్ర తలసరి ఆదాయం

జగన్ పాలనలో జాతీయ సగటును మించి పెరుగుదల

2023-24 దేశ ఆర్థిక వ్యవస్థ గణాంకాల నివేదికలో ఆర్‌బీఐ వెల్లడి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఊడ్చేసింది

చెరువుల్లా పొలాలు.. కనుచూపు మేర ఇసుక మేటలే..

నోటికాడ ముద్ద నేలపాలు.. ఆవిరైన అన్నదాత ఆశలు

కృష్ణా లంకల్లోనే కాదు.. 'ఏలేరు' పరీవాహకంలోనూ అదే దుస్థితి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మానుకోండి

ఏపీ సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి.. అవసరం లేదంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం చాలా దారుణమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేసే బృహత్తర యజ్ఞానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తన చేతులతో తానే భంగం కలిగించడం అత్యంత హేయం, దుర్మార్గమని మండి పడ్డారు. పక్క రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితుల్లో మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పి పంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం అని చంద్రబాబును నిలదీశారు. 'ఇకనైనా కళ్లు తెరవండి.. వెంటనే ఎన్‌ఎంసీకి రాసిన లేఖను వెనక్కు తీసుకోండి. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోండి' అని హితవు పలికారు. మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేసి, పేద పిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'మీకు చేతనైనంత మీరు ఖర్చు చేస్తూ వెళ్లండి.. మీకు చేతకాకపోతే మళ్లీ మేం వచ్చిన తర్వాత అయినా పూర్తి చేస్తాం. అంతేకానీ ఇలా మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం మాటున స్కామ్‌లు చేయడం మానుకోండి. లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని గుర్తించుకోండి' అని చంద్రబాబును హెచ్చరించారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వ తీరును తూర్పారపడుతూ ఆదివారం 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

హైడ్రాకు కులమతాలు, రాజకీయాలు లేవు



ఇంజనీర్స్ డే వేడుకల్లో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ తదితరులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: రాష్ట్ర ప్రభు త్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు కులమతాలు, రాజకీయాలు లేవని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. వందేళ్ల క్రితం హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తాయని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పక్కా మాస్టర్ ప్లాన్ దిశగా హైడ్రా చర్యలు చేపట్టిందన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమాని కి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ '1908లో భారీ వరదలు వచ్చి హైదరాబాద్ నిండా మునిగింది. ఆ సమయంలో నిజాం నవాబు విశ్వేశ్వరయ్య గురించి తెలుసుకొని హైదరాబాద్‌కు ఆహ్వానించి హైదరాబాద్‌లో ఫ్లడ్ ప్రొటెక్షన్ అండ్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు గురించి చెప్పగా, హైదరాబాద్ భౌగోళిక స్థితిగతులపై పూర్తిగా అధ్యయనం చేసిన విశ్వేశ్వర య్య నగరం పైభాగంలో ఉన్న 788 చెరువులకుగాను వరదల కారణంగా 221 చెరువులు పూర్తిగా ధ్వంసమయ్యాయని గుర్తించారు. వర దలను తట్టుకోవాలంటే నగరానికి పై భాగంలో ఓ పెద్ద రిజర్వాయర్ కట్టాలని ప్రపోజ్ చేశారు. అందులో భాగంగానే మూసీకి ఉపనది అయిన ఇప్పుడున్న హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేశారు'అని తెలిపారు. అనంతరం ప లువురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐఈఐ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, మాజీ చైర్మన్ రమణానాయక్, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ మోయినుద్దీన్ పాల్గొన్నారు.

మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయండి

మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే మాదిగల మేలు కొలుపు యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఆదివారం మేలు కొలుపు యాత్ర కరపత్రాన్ని చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి విడుదల చేశారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, జనాభా ప్రాతిపది కన రిజర్వేషన్ కల్పించాలని చంద్రశేఖర్ ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై కమిటీ వేయడం హర్షణీయమన్నారు. పిడమర్తి రవి మాట్లాడుతూ, మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణతో తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు భూదాల బాబూరావు, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఓక్కల గడ్డ చంద్రశేఖర్, తెలంగాణ దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రమళ్ల మొగులయ్య, జేఏసీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు నక్క మహేశ్, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జెరిపోతుల సాయి మాదిగ పాల్గొన్నారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి పరామర్శ



జడ్చర్ల: మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతరెడ్డి అకాలమరణం చెందడంతో ఆయనను ఆదివారం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, జోగు రామన్న తదితరులు పరామర్శించారు. వారు హైదరాబాద్ నుంచి నేరుగా నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామంలోని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాసానికి చేరుకున్నారు. శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లక్ష్మారెడ్డితో కొద్ది సేపు మాట్లాడి మనో ధైర్యం చెప్పారు. మాజీ మంత్రులతో పాటు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్ రావు, రవీందర్‌నాయక్ ఉన్నారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు పట్టణంలో సోమవారం గణనాథుడి శోభాయాత్ర సందర్భంగా అన్ని మద్యం దుకాణాలతోపాటు బార్లు బంద్ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు మూతబడి ఉంటాయని, మళ్లీ తిరిగి మద్యం దుకాణాలు ఈ నెల 17న ఉదయం తెరవాలని ఆయన చెప్పారు.

లైబ్రరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్

జడ్చర్ల టౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జూనియర్ కళాశాలల లైబ్రేరియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం జడ్చర్లలోని జూనియర్ కళాశాలలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా షణ్ముఖరెడ్డి, కోశాధికారిగా సలీం జావెద్, గౌరవాధ్యక్షుడిగా విద్యాసాగర్, సలహాదారుగా జయప్రకాష్ ఎన్నికయ్యారు. సమావేశానికి రాష్ట్ర పరిశీలకులు గోపాల్‌నాయక్ హాజరై మాట్లాడారు. ఇంటర్ విద్యకు సంబంధించి అన్ని రకాల డ్యూటీల్లో పాలుపంచుకునేందుకు నూతన కార్యవర్గం కృషిచేయాలని సూచించారు.

నిర్వహణ అస్తవ్యస్తం



జడ్చర్ల- మిడ్జిల్ మధ్యలో జాతీయ రహదారిని కమ్మేసిన ముళ్లచెట్లు

- జాతీయ రహదారికి ఇరువైపులా కమ్ముకుపోయిన ముళ్లచెట్లు
- టోల్ రుసుం వసూళ్లు ఉన్నా.. పర్యవేక్షణ కరువు
- గాలికి వదిలేసిన రోడ్డు పర్యవేక్షణ, భద్రత
- సూచికలపై నిలువెత్తు నిర్లక్ష్యం
- పట్టింపు లేని అధికారులు
- ప్రమాదభరితంగా 167 నంబర్ జాతీయ రహదారి



టోల్ గేటు వద్ద సూచికబోర్డుల దుస్థితి

జడ్చర్ల: ఇదో.. జాతీయ రహదారి. కానీ జాతీయ రహదారిలా కనిపించదు. ఎక్కడో మారుమూల ప్రాంతాలకు ఉన్న రహదారిలా కనిపిస్తుంది. రహదారికి ఇరువైపులా కమ్ముకుపోయిన ముళ్లచెట్లు కనిపిస్తున్నాయి. రహదారిపై గుంతలతో పాటు నెర్రెలు ఇచ్చాయి. రహదారిపై ఇసుక, మట్టి ఉంటుంది. దీంతో ద్విచక్ర వాహనాలు, తదితర వాహనాలు జారుతూ ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి దర్జాగా టోల్ రుసుం వసూలు చేస్తున్నా.. రహదారి నిర్వహణకు ఎక్కడా ఎన్నడూ ఓ రూపాయి ఖర్చు చేయడంలేదు. ఈ రహదారిపై పాలకులు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. ఏనాడు దీనిపై దృష్టి సారించలేకపోవడం శోచనీయం. జడ్చర్ల నుంచి కోదాడ వరకు 167 నంబర్ జాతీయ రహదారికి సంబంధించి జడ్చర్ల- మిడ్జిల్ మధ్యలో రహదారి ప్రమాదభరితంగా మారింది.

వసూళ్ల పైనే దృష్టి..

మిడ్జిల్ మండలం మున్ననూర్ టోల్ గేటు వద్ద రహదారికి సంబంధించి రుసుము వసూలు చేస్తున్నారు. అయితే వసూళ్లపైన ఉన్న శ్రద్ధ రోడ్డు నిర్వహణపై ఉండటంలేదు. టోల్‌గేటుకు రెండు వైపుల ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు ఎక్కడికక్కడ ఊడిపోయాయి. బోర్డులపై తగిన సమాచారం లేదు. టోల్ ఫీజులు ఎంత ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఫాస్టాగ్ ఉన్నా.. మళ్లీ మ్యానువల్‌గా స్కాన్ చేసే పరిస్థితి ఉండటంతో రాకపోకల సమయంలో ఆలస్యం అవుతుంది.

రోడ్డు నిర్వహణ గాలికి..

టోల్ చార్జీలను వసూలు చేస్తున్న టోల్ నిర్వాహకులు రోడ్డు పర్యవేక్షణతో పాటు భద్రతను చూడాలి. అయితే కేవలం టోల్ రుసుం వసూళ్లపైనే దృష్టి సారించి రోడ్డు నిర్వహణను గాలికి వదలేశారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన పలు సూచికలు గాలులకు అటు ఇటుగా తిరిగి దిశలు మారాయి. దీంతో సూచికలు అర్థం కాని పరిస్థితి నెలకొంది.

కనీస సౌకర్యాలు కరువు..

టోల్‌ప్లాజా వద్ద వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. మరుగుదొడ్లు, తాగునీరు, ప్రాథమిక వైద్యం తదితర వసతులను నిర్వాహకులు ఏర్పాటు చేయలేదు. రోడ్డుపై ప్రమాద సమయంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు ముందస్తుగా అంబులెన్స్ సౌకర్యం లేదు.

ప్రమాదభరితంగా రహదారి..



మిడ్జిల్ నుంచి జడ్చర్లకు వెళ్లే జాతీయ రహదారి ప్రమాదభరితంగా మారింది. మున్ననూర్ పరిధిలో రోడ్డుపై గోతులు పడ్డాయి. రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, ఇసుక కళ్లలో పడుతుంది. రోడ్డుకు ఇరువైపుల ముళ్లచెట్లు కమ్ముకుపోయాయి. సంబంధిత అధికారులు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు.

– పవన్‌కుమార్, వేముల, మిడ్జిల్ మండలం

పట్టింపులేని అధికారులు..

నేషనల్ హైవే అథారిటీ అధికారులు టోల్‌గేట్ వ్యవహారంపై కనీసంగా స్పందించిన దాఖలాలు మచ్చుకైనా లేవు. కనీసంగా సంబంధిత అధికారులు, టోల్‌నిర్వాహకుల ఫోన్ నంబర్లు కూడా వినియోగదారులకు అందుబాటులో ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టోల్‌ప్లాజా నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి వాహనదారుల సేవలకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కలెక్టర్, ఎస్పీలు ఓ సారి ఈ రహదారిని పరిశీలించాలని కోరుతున్నారు.



జాతీయ రహదారిపై పేరుకుపోయిన ఇసుక, మట్టి

వివాదాస్పదంగా టోల్ నిర్వహణ..

టోల్‌గేట్ నిర్వహణ మొదటి నుంచి వివాదాస్పదంగా మారింది. ఇక్కడ ఒకసారి టోల్ దాటితే పలుసార్లు టోల్ దాటినట్లుగా వాహనదారుల ఫాస్టాగ్ ఖాతాల నుంచి డబ్బులు కట్ అయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికీ పలువురు తమ ఫాస్టాగ్ ఖాతా నుంచి డబ్బులు కట్ అవుతున్నాయంటున్న ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై వినియోగదారులు ఆందోళనలు చేసిన పరిస్థితి ఉంది. అంతేగాక ఇక్కడి టోల్‌గేట్ వద్ద పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుని గాయపడటంతో పాటు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. వాస్తవంగా టోల్ పరిధిలో రహదారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. లోపాలను సరిచేస్తూ.. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత టోల్ నిర్వాహకులపై ఉంది. రహదారికి ఇరుపక్కల ఎప్పటికప్పుడు ముళ్లచెట్లు, ముళ్ల పొదలు తొలగించాల్సి ఉండగా అవి ఏవి చేపట్టడంలేదు.

కొల్లాపూర్ – శ్రీశైలం బస్సు ప్రారంభం

కొల్లాపూర్: కొల్లాపూర్ నుంచి శ్రీశైలం క్షేత్రానికి ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సును ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు కొల్లాపూర్ నుంచి బస్సు బయలుదేరుతుందని.. తిరిగి మధ్యాహ్నం 2:30 గంటలకు శ్రీశైలం నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరి వస్తుందని డీఎం ఉమాశంకర్ మంత్రికి తెలియజేశారు. అదేవిధంగా వీపనగండ్ల నుంచి గోపల్‌దిన్నె మీదుగా కర్నూల్‌కు వెళ్లేందుకు కూడా బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం వివరించారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ - శ్రీశైలం బస్సును ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

దేవాలయ వ్యవస్థకు పునాది అర్చకులే..



మాట్లాడుతున్న రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ, అర్చక సంఘం నాయకులు

జోగుళాంబ శక్తిపీఠం: దేవాలయ వ్యవస్థకు అర్చకులే పునాది అని రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ అన్నారు. ఆదివారం అలంపూర్, బీచుపల్లి, ఉమామహేశ్వరం, బుద్దారం, మద్దిమడుగు ఆలయాలను ఆయనతోపాటు, ప్రధాన కార్యదర్శి దిండిగళ్ ఆనంద్‌శర్మ, గద్వాల జిల్లా అధ్యక్షుడు మారుతిచారి, రాష్ట్ర బాధ్యులు ఉమమాహేశ్వరం వీరయ్యశాస్త్రీ సందర్శించారు. ఈ సందర్భంగా డీవీఆర్‌శర్మ మాట్లాడుతూ.. దేవాలయ వ్యవస్థకు అర్చకులు పునాది అని, కానీ ఆలయాల్లో పని చేస్తున్న అర్చక ఉద్యోగులు మాత్రం వేతనాలు సరిగా రాక.. ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ కార్డు, ఇలా ఏ ఒక్క సౌకర్యం వీరికి అందక.. అనేక సమస్యలతో జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో నాటి ప్రభుత్వం జీఓ నంబర్ 577లో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్చక ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని, 1వ తేదీన వేతనం చెల్లించాలని పేర్కొందన్నారు. అలాగే, రాష్ట్రంలోని 686 ఆలయాల్లో పని చేస్తున్న 5,625 మంది అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు ద్వారా వేతనాలు అందివ్వాలని ఆదేశించినా.. కేవలం 2927 మందికి మాత్రమే వర్తింపజేశారన్నారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్చక ఉద్యోగులకు 010 పద్దు ద్వారా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు

అలంపూర్ రూరల్: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠమైన జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. కార్మిక శాఖ కమిషనర్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ సిబ్బంది, అర్చకులు ఘన స్వాగతం పలికి.. తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.



జోగుళాంబ ఆలయంలో కార్మిక శాఖ కమిషనర్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుముదినికి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

సనాతన ధర్మం అంటేనే త్యాగం

ప్రవచనకర్త డా.గరికపాటి గురజాడ

జడ్చర్ల టౌన్: సనాతన ధర్మం అంటేనే త్యాగమని ప్రపంచానికి చాటిన గొప్ప ధర్మదేశం మనదని ప్రవచనకర్త డా.గరికపాటి గురజాడ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దేవి థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో జన్మించిన ఆధ్యాత్మిక సంప్రదాయం హిందు ధర్మం అని, దీన్నే సనాతన ధర్మం అంటారన్నారు. ధర్మం అనగా ఆచరణీయ కార్యం, మతమనగా అభిప్రాయమన్నారు. హిందు అనే పదానికి పార్శి భాషలో సింధు అని అర్థమని, సింధూనది తీరాన నివసించే వారిని అలా పిలిచేవారని, ఇపుడైతే వేదాలు, వాటికి సంబంధించిన మతాలను ఆచరించే వారిని హిందువు అని పిలుస్తున్నారన్నారు. జనసంఖ్య ఆధారంగా హిందు ధర్మాన్ని పాటించే వారు ప్రపంచంలో మూడోస్థానంలో ఉన్నారన్నారు. ప్రస్తుత కుటుంబ పరిస్థితులు, పిల్లల వ్యవహార శైలిపైన ఆయన ప్రసంగించారు. పిల్లలను అతిగారాభం చేయకుండా వారికి సంస్కృతి, సంప్రదాయాల గూర్చి అవగాహన కల్పించి సన్మార్గంలో పయనించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.